చులకన భావంతో పిలిచే కులాల పేర్లను

గౌరవప్రదంగా పిలిచేలా మారుస్తాం

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

జగిత్యాల, మార్చి 27 : సమాజంలో నేటికీ చులకన భావంతో పిలిచే కులాల పేర్లను గౌరవప్రదంగా పిలిచేలా వాటిని మార్చేందుకు చర్యలు తీసుకుంటామని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ స్పష్టం చేశారు. చులకన భావంతో కులాలను పిలవడంతో ఆ కులస్తులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. వారి ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీసీ కమిషన్ రెండో రోజు పర్యటనలో భాగంగా గురువారం జిల్లాలో కమిషన్ పర్యటించారు. అనంతరం వారు నేరుగా తారక రామనగర్‌లో వీర ముష్టి కమ్యూనిటీ భవనం, గాంధీనగర్‌లో గల దొమ్మర సంఘ భవనంలో బీసీ కుల సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ, సమాజంలో ఇప్పటికీ కొన్ని కులాల పేర్లు చులకన భావంతో పిలిచేలాగా ఉన్నాయని, బూతు పదాలుగా వాడుతున్నారని ఆవేదన వ్యకం చేశారు. బీసీ జాబితాలోని ఎనిమిది కులాల పేర్లు మార్చాలని, కొన్ని పర్యాయపదాలు జోడించాలని వచ్చిన ప్రతిపాదనలపై ఇప్పటికే తెలంగాణ బీసీ కమిషన్ అభ్యంతరాలు కోరిందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే సిరిసిల్ల, జగిత్యాలలో పర్యటిస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ ఫలాలు బీసీలకు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

కుల సంఘం సభ్యులతో బీసీ కమీషన్ సభ్యులు

వీర ముష్టి కులం పేరు మార్చాలి..

వీర ముష్టి అంటే పూర్వ కాలంలో యుద్ధ వీరులుగా ఉండే వారని కాలక్రమేణా ముష్టి అనే పదం బిచ్చగాళ్లు అడుక్కునే పర్యాయ పదంగా మారిందని వీరాముష్టి ప్రతినిధులు బీసీ కమిషన్ చైర్మన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. తమ కులాన్ని వీర భద్రీయ కులంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గడ వంశీయులుగా మార్చాలి.

కులం సర్టిఫికెట్లో తమ కులం పేరును గడ వంశీయులుగా మార్చాలని దొమ్మరి కుల సంఘం ప్రతినిధులు బీసీ కమిషన్ చైర్మన్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. కులం పేరు దొమ్మరి ఉండడంతో తాము సమాజంలో అనేక ఇబ్బందులు పడుతున్నామని చులకన భావంతో చూస్తున్నారని వివరించారు. దీనిపై చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని బీసీ కమిషన్ చైర్మన్ స్పష్టం చేశారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, బీసీ సంక్షేమ జిల్లా అధికారి కల్పన, తహసీల్దార్ రామ్మోహన్ పాల్గొన్నారు.

బీసీ కులాల స్థితిగతులు తెలుసుకునేందుకు పర్యటన

బీసీ కులాల్లోని వీరముష్టి, పిచ్చకుంట్ల, దొమ్మర, కులాల స్థితిగతులను తెలుసుకునేందుకు తాము ఇక్కడికి వచ్చినట్లు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సోషియో, ఎకనామిక్ కుల గణన సర్వే నిర్వహించి, అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు ఆమోదించిందని వెల్లడించారు. తమ కులం పేరు విద్యాలయాలు, ఉద్యోగ స్థలాల్లో పిలుచుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని, ప్రత్యామ్నాయ పేరు ఇవ్వాలని వీరభద్ర, పిచ్చగుంట్ల, దొమ్మరి వారు విజ్ఞప్తులు అందజేశారని వివరించారు. అనంతరం ఈ విషయాన్ని 29 తేదీన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని టీఆర్ నగర్, గాంధీనగర్, పలు ప్రాంతాల్లో పర్యటించామని వివరించారు.

వడగండ్ల వాన బాధితులను ఆదుకోవాలి

జగిత్యాల, మార్చి 27 : తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వర్షాలతో నష్టపోయిన రైతన్నలకు ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో కార్యాలయ ఏవోకు గురువారం వినతిపత్రం అందించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వర్షాలతో 16 జిల్లాల్లోని 78 మండలాల్లో 16250 ఎకరాలలో పంట నష్టం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, తిరుపురం రాంచందర్, రాచకొండ రోజా, గుంటి గంగారాం, దండుగుల వంశీ, బండపెల్లి మల్లీశ్వరి, రాపర్తి రవి, బండపెల్లి నర్సయ్య, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 27 : ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ సూచించారు. యామాపూర్, ఫకీర్‌కొండాపూర్ గ్రామాల్లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 13 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకొచ్చినట్లు వ్యవసాయాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాగర్, హర్టికల్చర్ ప్రతినిధులు అక్షయ్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

కొడిమ్యాల, మార్చి 27 : విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని జూనియర్ కళాశాల అధ్యాపకులు కోరారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు అనిల్ కుమార్, తిరుపతి, శ్యామ్‌కుమార్, అన్వేశ్, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
HOUSE FOR SALE

★**కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును**, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం–1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.
NTK-0000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కోరుట్ల, మార్చి 27: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు నజీమొద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి రాము గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల విద్యాధికారి గంగుల నరేశం తెలిపారు. కాగా, ప్రభుత్వ ఉపాధ్యాయుడి కుమార్తె స్థానిక గౌతమ్ మోడల్ స్కూల్లో 10వ తరగతి పరీక్షలు రాస్తుంది. ఈ క్రమంలో అధికారులకు తనకు సంబంధించిన వారు ఎవరూ లేరని తప్పుడు డిక్లరేషన్ ఇచ్చిన ఉపాధ్యాయుడు అదే పాఠశాలలో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వర్తించారు. ఈ విషయంలో జిల్లా విద్యాధికారి ఇదివరకే సంజాయిషీ నోటీసు అందజేసి, గురువారం నిజాముద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల విద్యాధికారి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు

బ్రేకర్లను పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

మల్యాల(కొడిమ్యాల), మార్చి 27 : రోడ్డు ప్రమాదాల నివారణకు సీఐ నీలం రవి గురువారం ఘాట్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాట్లు చేయించారు. మండలంలోని కొండగట్టు గుట్ట కింద ఘాట్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను అదుపు చేసేందుకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ అశోక్ కుమార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సురక్షిత ప్రయాణం అనే కార్యక్రమంలో భాగంగా స్పిడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎస్ఐ నరేశ్ ఉన్నారు.

బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం

జగిత్యాల రూరల్, మార్చి 27: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపునకు చెందిన బాల్య మిత్రుడు అబ్దుల్ రజాక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు గురువారం రజాక్‌ను పరామర్శించి, రూ. 66 వేలు సాయం అందజేశారు.

రైతు సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయం

ధర్మపురి, మార్చి 27 : రైతు సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయమని సహకార సంఘం అధ్యక్షుడు డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం సహకార సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జమ, ఖర్చులపై చర్చించారు. రైతులకు పంట రుణాలను సకాలంలో మంజూరు చేయాలన్నారు. అనంతరం ధర్మపురి ఏఎంసీ చైర్మన్ చిలుముల లావణ్య–లక్ష్మణ్ సహకార సంఘం చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డిని సన్మానించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సింహులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ షేర్ల రాజేశం, డైరెక్టర్లు ఎల్లాగౌడ్, లింగన్న, జాజాల లక్ష్మి, అడాప్షన్ అధికారి రాము, సీఈవో రాజేశ్ ఉన్నారు.

ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వాలి

జగిత్యాల, మార్చి 27 : బుడుబుక్కల, పిచ్చకుంట్ల, దొమ్మరి, వీరభద్రీయ, వంశ రాజ్ కులాల వారు వారి కులాల మార్పు కోసం పెట్టుకున్న వినతిని ఆమోదించాలని టీ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కోరారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో గాంధీనగర్‌లో దొమ్మర కులస్తుల సంఘ భవనంలో బీసీ సంక్షేమజిల్లా అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు ఆయా కులాల మార్పు ఆమోదించాలని టీబీసీ జేఏసీ తరపున వినతిపత్రం అందజేశారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయ ప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీలను టీబీసీ జేఏసీ తరపున ఘనంగా సన్మానించారు. బీసీ ఉద్యోగుల జిల్లా గౌరవ అధ్యక్షుడు పిసి హన్మంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దిండిగాల విఠల్, జగిత్యాల నియోజకవర్గ బీసీ జేఏసీ అధ్యక్షుడు పుప్పాల నర్సింగరావు, పద్మ, పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

మల్లాపూర్, మార్చి 27 : మండలంలోని ఓబులాపూర్, ఓబులాపూర్ ఎస్టీ తండా గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం కింద కూలీలతో చేస్తున్న పనులను గురువారం ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఉపాధిహామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించి, కొలతలు తప్పకుండా జాగ్రత్తలను వహించాలని అధికారులను సూచించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం

మేడిపల్లి, మార్చి 27 : మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో చికిత్స కోసం హాస్పిటల్ చేరింది. డాక్టర్ పరీక్షించి చికిత్స సమయంలో 'ఓ' పాజిటీవ్ రక్తం అవసరమని కుటుంబసభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యుల సూచన మేరకు స్పందించిన అదే గ్రామానికి చెందిన రవితేజ హాస్పిటల్‌కు వెళ్లి రక్తదానం చేసి ఆదుకున్నాడు. రక్తదానం చేసిన రవితేజను మిత్రులు, డాక్టర్‌లు, కుటుంబసభ్యులు అభినందించారు.

జగిత్యాల రూరల్ : పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

ధర్మపురి : పోలీస్‌స్టేషన్లో మాజీ సర్పంచులు

మెట్‌పల్లి రూరల్: పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు

మాజీ సర్పంచులపై నిర్బంధకాండ

మెట్‌పల్లి రూరల్, మార్చి 27: మండలంలోని పలు గ్రామాలకు చెందిన తాజా మాజీ సర్పంచులు, మహిళా సర్పంచుల భర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. శాసనసభ సమావేశాల సందర్భంగా పెండింగ్ బిల్లుల విడుదల కోసం అసెంబ్లీని ముట్టడిస్తారన్న నెపంతో మాజీ సర్పంచులను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. కాగా. మాజీ సర్పంచులు మాట్లాడుతూ, ఇది ప్రజాపాలన ప్రభుత్వమా..? లేక అరెస్టుల సర్కారా..? అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మాజీ సర్పంచులు బద్దం శేఖర్, ఆకుల రాజరెడ్డి, చౌట్‌పల్లి అంజయ్య తదితరులున్నారు.

ధర్మపురి, మార్చి 27: పెండింగ్ బిల్లులను క్లీయర్ చేయాలనే డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న తాజా మాజీ సర్పంచులను బుగ్గారంలో ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. తాజా మాజీ సర్పంచులు జగన్, రాజు, మహిళా సర్పంచుల భర్తలు ఉన్నారు.

జగిత్యాల రూరల్, మార్చి 27: ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు 6 సార్లు సర్పంచులను అక్రమంగా అరెస్టులు చేశారని సర్పంచుల పోరం మండలాధ్యక్షుడు చెరుకు జాన మండిపడ్డారు. సర్పంచుల అక్రమ అరెస్టులను ఖండించారు. మాజీ సర్పంచులు ఎల్ల రాజన్న, బుర్ర ప్రవీణ్, జక్కుల పతిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి, మార్చి 25: పెగడపల్లి మండలానికి చెందిన తాజా మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. తాజా మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు ఇనుగాండ్ల కరుణాకర్‌రెడ్డి, లక్ష్మణ్, చిందం తిరుపతి, సాయిని రవీందర్, ముద్దం మల్లేశం, గురిజల శ్రీనివాస్ తదితరులున్నారు.

కోరుట్ల రూరల్, మార్చి 27 : మండలంలోని ఆయా గ్రామాల చెందిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మాజీ సర్పంచులు దారిశెట్టి రాజేశ్, కేర్తీ రెడ్డి భాస్కర్ రెడ్డి, వీ అంజయ్య, చెప్యాల నర్సయ్య తదితరులున్నారు.

వెల్గటూర్, మార్చి 27 : మండలంలోని పలువురు సర్పంచ్‌లను పార్టీలకు అతీతంగా అరెస్టు చేసి, పోలీసు స్టేషన్‌లో బందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ అక్రమ అరెస్టులు ఆపి, తమ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాంబాబు, బోడకుంటి రమేశ్, రాంచంద్రంగౌడ్, కొప్పుల విద్యాసాగర్, గాగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మేర్గు కొంరయ్య, బాలసాని రవి, అనుమాల తిరుపతి, యాగండ్ల తిరుపతి, సనిల్ తదితరులు ఉన్నారు.

మల్లాపూర్, మార్చి 27: మల్లాపూర్‌లో మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన మాజీ సర్పంచులు వనతడపుల నాగరాజ్, భూక్యా గోవింద్‌నాయక్, సయ్యద్ హైదర్, తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి, మార్చి 27: మండలంలోని బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను పోలీస్‌లు అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్‌లు నేరెళ్ల గంగా రెడ్డి, అలిశెట్టి రవీందర్, నల్ల శ్యాం, కిషన్‌ను అరెస్టు చేసి సొంత పూచికత్తుపై వదిలేశారు.

సర్పంచులపై అక్రమ కేసులు పెట్టొద్దు

ఎస్పీకి జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, మాజీ ఎమ్మెల్యే వినతి

ఎస్పీ కార్యాలయం ఎదుట దావ వసంత, సుంకె రవీందర్

జగిత్యాల, మార్చి 27 : బీఆర్ఎస్ తాజా మాజీ సర్పంచులపై అక్రమంగా పెడుతున్న కేసులపై గురువారం ఎస్పీ అశోక్ కుమార్‌ను కలిసి సరైన న్యాయపాలన అందించాలని జిల్లా జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ కోరారు. శుక్రవారం ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో ఫ్రెండ్లీ పోలీసులతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి ప్రజల్ని, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను భయబ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పోలీసులు రాజ్యాంగానికి చట్టానికి లోబడి పని చేయాలన్నారు. వారి వెంట మాజీ జడ్పీటీసీ రామ్మోహన్ రావ్, పాక్స్ చైర్మన్లు సాగర్ రావు, మహిపాల్ రెడ్డి, మధుసూదన్, మాజీ ఏఎంసీ చైర్మన్ జనగం శ్రీనివాస్, జగిత్యాల రూరల్, అర్బన్ మండలాధ్యక్షులు ఆనందరావు, గంగాధర్, మాజీ సర్పంచులు తిరుపతిరెడ్డి, ప్రవీణ్, తిరుపతి, ఎల్లా రాజనర్సు, రాజన్న, కరుణాకర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు ఘాట్ రోడ్డుపై ప్రమాదం

- **చికిత్సపొందుతూ ఒకరి మృతి**
- **ఇద్దరికి తీవ్రగాయాలు**

మల్యాల(కొడిమ్యాల), మార్చి 27 : దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా, కొండగట్టు ఘాట్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన శివరాత్రి లింగయ్య కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి బుధవారం కొండగట్టు అంజన్న సన్నిధికి చేరుకున్నారు. గురువారం ఉదయం మొక్కులు చెల్లించుకొని తిరుగు ప్రయాణంలో టాటా ఏస్ వాహనంలో కొండగట్టు కిందకు దిగుతున్నారు. ఈ క్రమంలో లింగయ్య కుమారుడు శివరాత్రి సాయికృష్ణ (17) బంధువైయిన మరో వ్యక్తి సంపంగి ప్రేమ్‌చందర్ ట్రాలీ టాప్‌పై కూర్చున్నారు. ఘాట్ రోడ్డు దిగుతుండగా, మూలమలుపు వద్ద టాటా ఏసీ డ్రైవర్ గోల్లేని విజయ్ వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ సడన్ బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో పైన కూర్చున్న సాయికృష్ణ, ప్రేమ్‌చందర్ ట్రాలీ ముందు పడిపోగా ఇద్దరిపై నుంచి ట్రాలీ వెళ్లింది. వారికి తీవ్ర గాయాలు కాగా, గమనించిన బంధువులు కారులో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ సాయికృష్ణ మృతి చెందగా, ప్రేమ్‌చందర్ చికిత్స పొందుతున్నాడు. లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ కుమార్ తెలిపారు.

దవాఖానను సందర్శించిన కేంద్ర బృందం

కోరుట్ల, మార్చి 27: కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ప్రతినిధులు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్ గురువారం కోరుట్ల ప్రభుత్వ ఏరియా దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, వైద్య సిబ్బందితో ప్రతినిధులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆసుపత్రిలో ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, ఆరోగ్య సిబ్బంది నియామకం, నిధుల వినియోగంపై చర్చించారు. ఈ సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన ఆసుపత్రి వైద్యులు వినోద్ కుమార్, లక్ష్మీ, రమేష్, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి తులసి రవీందర్, హెచ్ఈ తరాల శంకర్, సూపర్‌వైజర్, మురళీధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

మెట్‌పల్లి, మార్చి 27: మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యకార సహకార విభాగం జిల్లా అధికారి మనోజ్‌కుమార్ సూచించారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా గురువారం మెట్‌పల్లి పట్టణంలోని మత్స్యకార పారిశ్రామిక సహకారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరైన మాట్లాడారు. 70 ఏండ్ల లోపు ఉన్న ప్రతి మత్స్యకార్మికుడు బీమా సౌకర్యం పొందాలన్నారు. ప్రతి సంవత్సరం ఒక్కో కార్మికుడికి రూ. 350 చొప్పున బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించనున్నట్లు తెలిపారు. అనంతరం అధికారులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, అధికారులు నిజాముద్దీన్, అశోక్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పట్టణ అధ్యక్షుడు పర్రె శంకర్, సాయన్న, సురేశ్, ఆర్మూర్ గంగన్న, కిషన్, రంజిత్, నర్సయ్య, రమేశ్, పోచయ్య, చిన్నయ్య, రాజేశ్, నరేందర్, నాగయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు

జగిత్యాల రూరల్, మార్చి 27 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 29న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు గురువారం జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో హోమ్‌కేర్ హైదరాబాద్‌లో 70, ప్రజ్ఞ గ్లోబల్ స్కూల్లో జగిత్యాలలో డాటా ఆపరేటర్, రిసెప్సనిస్ట్ కు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, బీఎస్సీ నర్సింగ్, ఏఎస్ఎంజీఎస్, ఎంపీడబ్ల్యూ కలిగి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు జగిత్యాల, హైదారాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుంది నెలకు వేతనం రూ, 9 వేల నుంచి 39,500 వరకు ఉంటుందన్నారు.

ఉపకార వేతనాల దరఖాస్తులకు గడువు పొడిగింపు

జగిత్యాల రూరల్, మార్చి 27 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థులకు 2024–25 విద్యాసంవత్సరానికి కాలేజీలో ఆన్‌లైన్ స్కాలర్ షిప్ కోసం దరఖాస్తులు చేసుకునేందుకు గడువును మార్చి 31 నుంచి మే 31 వరకు పొడగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు తెలిపి ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఉగాది కళా జాతర

మారుతీనగర్, మార్చి 27 : మెట్‌పల్లి పట్టణంలో లలిత కళా సమతి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉగాది కళా జాతర కార్యక్రమాన్ని గురువారం అధ్యక్షులు గోదూరు మురళి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చావిడి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలో ఒగ్గుడోలు, జనపద నృత్యాలు, పేరిణి ,భరత నాట్యాలు పలువురు కళాకారులు చేసిన నాట్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కాగా వచ్చే ఉగాది వరకు కళాజాతర ఉత్సవాల్లో భాగంగా వివిధ వార్డుల్లో ప్రతి నెలా ప్రజాప్రతినిధులు, యువజ సంఘాల సహాయ సహకారాలతో నిర్వహించనున్నట్లు నిర్వహాకులు తెలిపారు. లలితి కళాసమితి కార్యనిర్వహణ అధికారి మట్టెల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కోటగిరి వెంకటస్వామి, నవీన్‌కుమార్, సహదేవ్, సత్తయ్య, జక్కం బాబు, రవి, గంగాధర్, కళాకారులు పాల్గొన్నారు.

సబ్ కీ వికాస్ సబ్ కీ యోజనపై సమావేశం

పెగడపల్లి, మార్చి 27: మండలపరిషత్ కార్యాలయంలో గురువారం సబ్‌కీ వికాస్ సబ్‌కీ యోజన కార్యక్రమంపై అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, మండలంలోని 23 పంచాయతీలకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ఆక్షన్ ప్లాన్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఎంపీవో మహేందర్, పీఆర్ ఏఈ శంషేర్ అలీ, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుబద్ర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ పకడ్బందీగా నిర్వహించాలి

జగిత్యాల, మార్చి 27 : జిల్లాలో ధాన్యం సేకరణ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత సూచించారు. గురువారం కలెక్టర్‌లో యాసంగి ధాన్యం సేకరణపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సహకార, వ్యవసాయ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులున్నారు.

విద్యారంగంలో గంగాధర్‌కు అత్యున్నత గౌరవం

జగిత్యాల, మార్చి 27 : దుబాయ్‌లో ఏప్రిల్ 12, 2025న నిర్వహించే 24వ విశ్వ పాఠశాల శిఖర సమావేశంలో అడ్లగట్ల గంగాధర్‌కు 'అత్యుత్తమ ఉపాధ్యాయుడు'పురస్కారానికి ఎంపికయ్యాడు. విద్యారంగంలో గంగాధర్ చేసిన కృషిని గుర్తించి, ఈ పురస్కారం అందజేయనున్నారు. కాగా, గురువారం దుబాయ్ నుంచి ఆయనకు ఆహ్వానిస్తూ లేఖ పంపించారు.

పసుపు ధర @ రూ.13,151

మెట్‌పల్లి, మార్చి 27: వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పసుపునకు పలికిన ధరలు ఇలా ఉన్నాయి. పసుపు కొమ్ము(కాడి) రకానికి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.13,151, కనిష్టంగా రూ.9,109 పసుపు మండ (గోళ) రకానికి గరిష్టంగా రూ.11,802, కనిష్టంగా రూ.8,888, పసుపు చూర రకానికి గరిష్టంగా రూ. 9,700 కనిష్టంగా రూ.8,885 ధర పలికింది. ఈ రోజు 817 క్వింటాళ్ల పసుపు కొనుగోలు జరిగింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 36233 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

కోరుట్ల రూరల్, మార్చి 27 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్నులను వసూలు చేయాలని ఎంపీడీవో వోదెల రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మోహన్‌రావుపేటలో నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా రోజు వారిగా నీటినందించాలని, పండ్ల మొక్కలను ఎక్కువగా పెంచాలని, గ్రామస్తులకు సరిపడా మొక్కలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామంలో ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సరిత, ఫిల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఉచిత వైద్యశిబిరంలో 120 మందికి చికిత్సలు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కథలాపూర్, మార్చి 27 : సిరికొండలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 50 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సంజీవ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, పరమేశ్వర్, కిషన్‌రెడ్డి, సతీశ్, రవి, లింబాద్రి, మక్తుమ్‌పాషా పాల్గొన్నారు.

ఇంటిపన్ను వడ్డీపై 90శాతం రాయితీ

మెట్‌పల్లి టౌన్ : మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద ఇంటి పన్ను చెల్లించే వారికి పన్ను వడ్డీ బాకాయిలపై ప్రభుత్వం 90శాతం రాయితీ కల్పిస్తుందని కమిషనర్ మోహన్ తెలిపారు. గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 31లోపు 25 శాతం కల్పిస్తున్న రిబెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి

కోరుట్ల, మార్చి 27: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం (వీడీఏ) ఏప్రిల్ నుంచే అందించాలన్నారు. వెయ్యి బీడీలకు గాను బీడీ కార్మికులకు రూ. 261.97 పైసలు ఏప్రిల్ నెల నుంచి వేతనంగా అందించాలని బీడీ పరిశ్రమల యజమానులకు నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో బీడీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు మౌలానా, ముక్రం, శాంత, విశ్వనాథం, రాధ, హనుమంతు, మహేశ్, వంశీకృష్ణ, అశోక్, భాగ్య, గంగు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

మెట్‌పల్లి టౌన్ : మెట్‌పల్లి మున్సిపల్ పరిదిలోని ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి నివారణకు లీకేజీలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ అధికారులకు ఆదేశించారు. గురువారం పట్టణంలో చేస్తున్న లీకేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న వార్డులలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌చార్జి ఇన్స్‌పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ముజీబ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

కథలాపూర్, మార్చి 27 : అంబారిపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం 100 ప్లేట్లు స్థానికుడైన పోలీస్ కానిస్టేబుల్ రాచమల్ల నవీన్ గురువారం అందజేశారు. విద్యార్థులు మధ్యాహ్నభోజనం సమయంలో ప్లేట్లు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారని తెలియడంతో 100 ప్లేట్లు అందించినట్లు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ గోపు శ్రీనివాస్, జవ్వాజీ రవి, హెచ్ఎం కిషన్‌రావు పాల్గొన్నారు.